# ఇది ఎన్నోసారో?

—డాక్టర్ సి.ఎం. మోహనరావు



"వచ్చి ఎంతసేపైంది అన్నయ్యా" అడిగాడు రామం అప్పుడే ఆఫీసు నుంచి వచ్చి ఇంట్లో అడుగు పెడుతూ, ఉద్యోగంల్లో చేరి పన్నెండు సంవత్సరాలైనా లంచ్ అవర్లో ఇంటికి వచ్చి లంచ్ తీసుకోడం రామంకి అలవాటు.

"అరగంట అవుతుందిరా..."

"వస్తున్నానని ఉత్తరం కూడా వ్రాయలేదు..."

"టైము లేకపోయిందిరా."

అన్నదమ్ములకు స్టీలు కంచాలలో భోజనం వడ్డించింది కాంతం.

"సునీతకు పెళ్ళిచూపులకు మొన్న పడేవ్‌గా వచ్చారురా" కూర కలుపుతూ అన్నాడు రాజేశ్వరరావు. సునీత రాజేశ్వరరావు రెండో అమ్మాయి, ఆఖరి అమ్మాయి. బంగారు బొమ్మలా వుంటుంది.

"ఎవరు?" అడిగాడు రామం.

"మనకు దగ్గర చుట్టాలే. కోవలు తీస్తే తెలిసింది. రాకపోకలు లేకపోవడం వల్ల బంధువులు ఎవరో ఈ రోజులలో తెలియడం లేదు. బ్రతుకుతెరువు కోసం ఎక్కడెక్కడికో చెదరిపోయారు" మామూలుగానే చెప్తున్నాడు రాజేశ్వరరావు. తెల్లని లాల్చి, తెల్లని పంచె, వెహ్రా కోటులో, పొడవుగా, దర్జాగా, హుందాగా, వాళ్ళ వాన్నలా, ఎదుటివాళ్ళ కళ్ళను ఆకట్టుకొనే మూర్తిత్వం రాజేశ్వరరావుది.

"ఆస్తిపాస్తులేమైనా వున్నాయా?" మళ్ళీ అడిగాడు రామం.

"ఆ! కొంచెం పల్లం, కొంచెం మెట్ట వుందట. అయినా వాళ్ళ ప్రాంతం భూములు వర్షం పడితేనే..." చప్పరించాడు రాజేశ్వరరావు.

"ఉద్యోగం?"

"బి.ఎ. ప్యాసై విజయనగరంలో మండల ఆఫీసులో ఉద్యోగం చేస్తున్నాడట."

"కట్నాలు, కానుకలు..."

"వాటి క్రింద ఓ ముప్పై వేలు అడిగారు. ఇంట్లో సంగతి నీకు తెలియందేముంది! నిలవ ఓ పైసా లేదు. కట్నానికి వున్న కాస్త పొలం మీద అప్పు తేవచ్చు అనుకో. మరి పెళ్ళి ఖర్చులు పది పదిహేను వేల వరకు అయ్యేటట్టుంది" చెప్పాడు రాజేశ్వరరావు. ఈ సంభాషణంతా కాంతం వింటూనే వుంది. రామం ఏ జవాబూ ఇవ్వలేదు. భోజనాలు అయ్యాయి. అంగటిలో మంచం మీద పడుం వాల్చగానే రాజేశ్వరరావుకి నిద్ర పట్టేసింది ప్రయాణ బడలిక వల్ల. మధ్యాహ్నం నిద్రపోవడం రామంకి అలవాటు లేదు. పెరట్లో వాలుకుర్చీలో కూర్చున్నాడు రామం. చిన్నదైనా అన్ని ఇమ్ములున్న ఇల్లు. ఆఫీసుకి దగ్గర.

"ఏమండీ మీ అన్నగారు పదిహేను వేలు మిమ్మల్నే ఇమ్మనేటట్టున్నారు" కిళ్లీ కట్టి ఇస్తూ అంది కాంతి.

"ఇంకా అడగలేదు కదా" నిదానంగా అన్నాడు రామం. రామం తల్లి పోలిక. సన్నగా, తెలుపు ఎరుపు కలబోసిన రంగులో ముద్దముచ్చటగా వుంటాడు రామం.

"ఇంకా వేరే అడగాలండీ... ధోరణి తెలియడం లేదూ?" వాస్తవాలను ఇట్టే పసిగట్టగలిగిన జాణ కాంతం.

"అంత మొత్తం మనల్నెందుకు అడుగుతారు?"

"అంతకాకపోతే కొంత ... ఓ పది వేలు... గతసారి చూశాను కదా మీ అన్నగారి పెద్ద కూతురి పెళ్ళికి. అప్పుడూ ఇంతే. అయినా అప్పుడు నేను కాపరానికి కొత్త. మనకూ బాధ్యతలు లేవు కాబట్టే ఊరుకున్నా. అప్పుడు చేసిన అప్పు ఇంకా తీరుస్తూనే వున్నారు. మళ్ళీ ఇప్పుడు అప్పు చేస్తే తీర్చేదెలా? ఇలా మీరు ఇతరుల కోసం అప్పులు చేసి తీరుస్తుంటే మన పిల్లల సంగతి ఏమిటండీ?" విలేపింది కాంతం. పెద్ద చదువుకోకపోయినా మంచి మాటకారి కాంతం.

"అలాకాదు కాంతం... అందరం కలిసే వున్నాము

కదా? మన-బాధ్యత కూడా కొంత వుంది కదా?"

"కలిసి వుండడం వాళ్ళ బాధ్యతలలోనే అయితే ఎలా? మొన్నటి వరకు మీ అన్నయ్య పిల్లలు ఇక్కడ వుండే కదా చదువులు సాగించారు. ఇంకా ఎన్నాళ్ళండి?"

"ఇలాగే అన్నయ్యా, వదిన అనుకొని వుంటే నా చదువే అయ్యేది కాదేమో?"

"మిమ్మల్ని మీ అన్నయ్య చదివించేరా? మీ నాన్న గారు చదివించేరా?" ప్రశ్నించింది కాంతం సూటిగా. అసలే గులాబీల్లాంటి బుగ్గలు మరికొంచెం ఎరు పెక్కాయి.

"నాన్నగారే అనుకో. అయినా అన్నయ్య పూనుకో పోతే ఏమయ్యేదో?"

"అందుకే కదండీ మీ అన్నగారి ఇద్దరి పిల్లల్ని మీ దగ్గరే వుంచి చదివించారు?"

"అక్కడికి అది అయిపోయిందంటావా కాంతం? అంత చిన్న విషయమా అన్నదమ్ముల అనుబంధం..."

"మీ అన్నయ్య ఓ రాముడు... మీరో లక్ష్మణుడు... అన్నగారి సేవలో మీరు ముసలి అయిపోండి... కానీ మీకూ బాధ్యతలున్న సంగతి మరచిపోకండి. మీ పిల్లల భవిష్యత్తు గురించి మీరు ఆలోచించనవసరం లేదా?" అంటూ రుసరుసలాడుతూ లేచింది టీ చేయడానికి.

"నా పిల్లలంటే నాకభిమానం లేదా? వారి భవిష్యత్తు గురించి ఆలోచించడం లేదా? అవును ఉద్యోగం చేస్తూ పుష్కరం అయింది. నేను సంపాదించింది ఏముంది? ఓ ఇల్లాలు, ఇద్దరు పిల్లలు. వాళ్ళ సుఖసంతోషాలు నాకు వద్దా? కావాలి... కాని ఏమిచేయగలను. చేసిన అప్పులు తీరుస్తూ ఇల్లు గడపడానికే జీతం... ఎదురింటి జోగారావులా టేబిలు కింద చేయి పెట్టలేను...' ఆలోచనలో పడ్డాడు రామం.

పిల్లలు లేచారు నాన్నా నాన్నా అని. రాజేశ్వరరావు లేచాడు.

"నాన్నగారు, పెద్దనాన్నగారు ఎప్పుడు వచ్చారు?"

"ఇందాకే వచ్చారమ్మా!"

"ఇప్పుడే కదా మేం పడుకున్నాం నాన్నగారు."

పిల్లలిద్దరూ పెద్దనాన్నగారి దగ్గరకు వెళ్ళారు.

"ఉండమ్మా ముఖం కడుక్కొని వస్తాను" అని పెరట్లో నూతి దగ్గరకు వెళ్ళాడు రాజేశ్వరరావు. ఈలోగా టీ చేసింది కాంతం. అన్నదమ్ములిద్దరికీ చెరో కప్పు టీ ఇచ్చి రాజేశ్వరరావు తెచ్చిన బందరు లడ్డూలు పిల్లలికి చెరొక రెండూ ఇచ్చింది కాంతం.

రాజేశ్వరరావు దగ్గర తన పిల్లల కంటె తమ్ముడి పిల్లలకే చేరిక ఎక్కువ. వాళ్ళిద్దరితో కొంతసేపు ఆడు కొని ఆ కబురూ, ఈ కబురూ చెప్పాడు రాజేశ్వరరావు. తర్వాత పిల్లలిద్దరూ లడ్డూల తిండిలో నిమగ్న మయ్యారు.

"ఓ పది వేలు కావాలిరా. ఉత్తరం వ్రాస్తాను. మిగతా పనులు చూసుకోవాలి కదా? వస్తాను. వస్తానమ్మా కాంతం" అని బస్సుకు వెళ్ళాడు రాజేశ్వరరావు.

పది రోజుల తర్వాత వచ్చాడు తమ్ముడింటికి రాజేశ్వరరావు పెళ్ళి కార్డులు ప్రింట్ చేయించడానికి.

"కాంతం చూడమ్మా... పెళ్ళి కార్డులు ఎలా వుంటే బాగుంటుందో చెప్పమ్మా..." అడిగాడు రాజేశ్వరరావు పది రకాల పెళ్ళి కార్డులు చూపిస్తూ.

"నాకేం తెలుస్తుందండీ..." అంది కాంతం.

"కాదమ్మా నీ సెలక్షను మీద నాకు గురి..." ఇంకా పెళ్ళికి పదిహేను రోజులుంది.

"పెళ్ళికి పది రోజులు ముందే నీవు, పిల్లలు రావాలమ్మా... ఇదే ఆఖరి పెళ్ళి... నీవు వచ్చాకనే పెళ్ళి పనులు ప్రారంభం అవుతాయి" కాంతంతో చెప్పాడు రాజేశ్వరరావు.

"ఏరా డబ్బు సంగతి ఏం చేశావు? నీవూ తొందరగా వచ్చేయి" బస్సుకు బయలుదేరుతూ అన్నాడు రాజేశ్వర రావు.

"సెలవు దొరకదు. రెండు మూడు రోజుల ముందు వస్తాను. వచ్చేటప్పుడు తెస్తాను" అని మాట ఇచ్చేశాడు రామం అనుకోకుండా. అక్కడే వున్న కాంతం వైపు చూశాడు రామం. కాంతం నిశ్చేష్టురాలై పాలరాతి బొమ్మలా నిల్చొని వుంది.

"కాంతం నీవు ఎంత చెప్పినా వినలేదు....లేదని చెబుదామనే అనుకున్నాను..ఏమిటో ఆ క్షణంలో అలాగే అనేశాను..." కాంతం తీక్షణంగా చూసింది. రామం చిన్నపిల్లాడిలా అమాయకంగా ముఖం పెట్టాడు.

"నా ఖర్మ... నేనెవర్ని? మీరూ మీరూ ఒకటి. ఒకే రక్తం పంచుకు పుట్టారు" అని విసురుగా లోపలికి వెళ్ళింది. వెనకపడ్డాడు రామం. క్షమాపణ చెప్పు కున్నాడు. కాంతం ఏమి చేస్తుంది? కోపం దిగమింగు కుంది.

"అయినా ఎక్కడ వుందని అంత డబ్బు ఇస్తానని ఒప్పుకున్నారు?"

"అదే ఆలోచిస్తున్నా ఇప్పుడు. అంత అప్పు దొరకడం కూడా కష్టమే. టైము లేదాయె? ఏం చేయడం?" చాలా విచారంగా ముఖం పెట్టాడు. గాభరా పడుతున్నాడు.

"మా అమ్మగారు నాకు పెట్టిన నగలు అమ్మేయండి" ముక్తసరిగా అంది కాంతం.

"నీ నగలు అమ్మేయడమా? అన్యాయం?"

"కాదు అలాగే చేయండి. కాకపోతే ఇంకా అన్యాయం అయిపోతాం!"

అనుమానంగా చూశాడు రామం.

"లేదండి.. మన స్ఫూర్తిగానే చెప్తున్నాను. అలాగే చేయండి. ఇప్పుడు అప్పులు తెస్తే వాటికయ్యే వడ్డీలే తీర్చడం కష్టం..."

రామం సంతోషానికి అవధులు లేవు. కాంతం నగలు అమ్మేయమండి అని చెప్పినందుకు కాదు, కాంతం శాంత పడినందుకు. నగలు ఎప్పుడైనా సంపాదించవచ్చు.

"ఇంకెప్పుడూ (అలా చూడకు కాంతం) ... ఇలా జరగదు" అని మాట ఇచ్చాడు రామం.

ఇది ఎన్నోసారో?

●

# జోక్స్

**టీ ఇచ్చి....**

విజయవాడ ఆకాశవాణి కార్య నిర్వాహణాధికారులలో ఒకరై ఇటీవలనే మరణించిన ఉష శ్రీగారు ఓ రోజు తెలుగు ప్రసారాలు, ప్రసంగాలలో తలమునకలవు తున్నప్పుడు ఓ పెద్ద మనిషి వచ్చి తనను తానుగా ఓ కవిగా పరిచయం చేసుకున్నాడట.

"ఎందుకు వచ్చారు తమరు?" సూటిగా అడిగారట ఉషశ్రీ.

"ఏదైనా ఇప్పించాలి తమరు" అన్నాడట పెద్దమనిషి.

పని ఒత్తిడిలో చిరాకుగా వున్న ఉషశ్రీ "ఏం ఇప్పించమంటారు?" అన్నారట ఆ ప్రశ్నకు.

"తమరేమి ఇప్పించినా సరే" అన్నాడు కవి.


ఉషశ్రీ వెంటనే ఆఫీసు కుర్రవాడిని పిలిచి "వీరికో 'టీ' ఇచ్చి పంపించు" అంటూ హడావిడిగా స్టూడియోలోకి వెళ్లిపోయారట.

ఇస్తారేమో ఓ టాకు టాకి వెళ్దామనుకున్న ఆ కవి విశ్చేష్టుడయ్యాడట.

—కె.వి.మధుసూదనరావు

భార్య: షాజహాన్ ముంతాజ్ కోసం తాజమహల్ కట్టాడు. మరి మీరు నా కోసం ఏం కట్టారు?

భర్త: నెల నెలా పాత్రల చీటి, చీరల చీటి, నగల చీటి కడుతున్నాను. అది చాలదా!




గుమాస్తా: మిమ్మల్ని చూడడానికి ఎవరో వచ్చారు.

ప్లీడరు: వాదా, ప్రతి వాదా?

గుమాస్తా: తీవ్రవాది లాగా వున్నాడు!

—'బంటి'